ప్రజాశక్తి

శనివారం 19, నవంబర్ 2022 5 శ్రీ సత్యసాయి



చిత్రావతి నది సుందరీకరణ పనులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

సత్యసాయి జయంతి ఉత్సవాలను దృష్టిలో ఉంచుకొని జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్ ఆదేశాల మేరకు చిత్రావతి నది సుందరీకరణ పనులు చేపట్టారు. పుట్టపర్తి వచ్చే భక్తుల ను దృష్టిలో ఉంచుకొని చిత్రావతి నదీ తీర ప్రాంతంలో నూతనంగా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసేందుకు పనులు వేగవంతం చేశారు. నదీ తీర ప్రాంతంలో అపరిశుభ్రంగా ఉన్న చెత్తాచెదారాన్ని ముళ్ళకంపలను తొలగిస్తున్నారు. చిత్రావతికి ఇరువైపులా పిచ్చి మొక్కలను తొలగించి నదిలో పడ్డ ప్లాస్టిక్ నుతొలగిస్తున్నారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పనులను వైస్ చైర్మన్ నరేష్‌కృష్ణ, చైర్మన్ గంగాద్రి లక్ష్మీనరసమ్మ పరిశీలించారు .

సొంతింటి కల నెరవేరేనా..?



హిందూపురం పట్టణ సమీపంలోని కొటిపి గ్రామ సమీపంలోని లేఅవుట్‌లో పునాదులకే పరిమితమైన ఇళ్లు

సామాన్యుడి కలల సౌధం కలగానే మిగిలిపోతోంది. ఏళ్లు గడుస్తున్నా జగనన్న లేఅవుట్లలో నివాసాల నిర్మాణాలు పునాదులకే పరిమితం అవుతున్నాయి. ఎన్నికల తరుణం కూడా దగ్గరపడుతోంది. దీంతో ఈ ఎన్నికలనాటికైనా పేదల సొంతింటి కల నేరవేరుతుందా? అని అనంతపురం ఉమ్మడి జిల్లాలోని పేదలు ఆశతో ఎదురుచూస్తున్నారు.

జగనన్న లేఅవుట్లలో కనిపించని కనీస సౌకర్యాలు

సమీక్షలతోనే సరిపెడుతున్న అధికారులు, పాలకులు

పునాదులకే పరిమితమైన ఇళ్లు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘంలో గత 15 సంవత్సరాలుగా పేదల సొంతింటి కల నెరవేరడం లేదు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పట్టణ సమీపంలోని కొటిపి గ్రామ సమీపంలో భూ సేకరణ చేపట్టి ఒక నివాస గృహానికి రెండు సెంట్లు చొప్పున 3600 మంది లబ్ధిదారులకు పట్టాలను మంజూరు చేశారు. అయితే నివాస గృహాలకు కేటాయించిన భూమి నల్లరేగడి కావడంతో ఎప్పటికైనా ప్రమాదమని తెలిసి లబ్ధిదారులు మక్కువ చూపలేదు. అనంతరం 2014లో జరిగిన ఎన్నికల సమయంలో పేదల సొంతింటి కలను నెరవేరుస్తామని చెప్పి టిడిపి అధికారంలోకి వచ్చింది. అయితే ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సౌజన్యంలో ఇదే స్థలంలో అపార్ట్‌మెంట్స్ నిర్మాణాలు చేసి ఇస్తామని చెప్పి పనులు సైతం ప్రారంభించారు. అయితే ఇళ్ల నిర్మాణాలు జరగలేదు. అక్కడ కనీస సౌకర్యలు కల్పించక పోవడంతో అవి కూడా నిరుపయోగంగా మారాయి. అనంతరం 2019 ఎన్నికల సమయంలో వైసిపి సొంతిల్లు లేని పేదలందరి కలలు నెరవేరుస్తామంటూ ఊదరగొట్టింది. అధికారం చేపట్టి మూడు సంవత్సరాలు పూర్తిఅయినా హిందూపురం పురపాలక సంఘంలో మూడు ఇళ్ల నిర్మాణం కూడా చేపట్టలేదు.

గృహ నిర్మాణశాఖ అధికారుల లెక్కల మేరకు పురపాలక సంఘంలో సుమారు 6400 మందికి ఇంటి స్థలాలను కేటాయించాలని ఎంపిక చేశారు. ఇందులో 4600 మందికి కొటిపి లేఅవుట్‌లో ఇళ్లు కేటాయించారు. మిగిలిన వారందరికీ రూరల్ మండలం మణేసముద్రం వద్ద ప్రత్యేక లేఅవుట్ సెంటు స్థలాన్ని కేటాయించారు. సెంటు స్థలంలో ఇళ్ల నిర్మాణాలు ఎలా చేయాలంటూ లబ్ధిదారులు చేతులెత్తేశారు. దీంతో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఇళ్ల నిర్మాణాలు చేసి ఇస్తామని గుత్తేదారులకు అప్పగించారు. గుత్తేదారులు 18 మాసాల నుంచి 4600 ఇళ్ల నిర్మాణాలకు గాను ఇప్పటివరకు కేవలం 700 ఇళ్ల నిర్మాణాల కోసం పునాదులు మాత్రమే వేశారు. ఇంకా 3900 పునాదుల నిర్మాణాలు ఇప్పటికీ ప్రారంభం కాలేదు. ఇప్పటి వరకూ ఒక్క నివాసం కూడా మొదలుకాని లేఅవుట్లు జిల్లాలో అనేకం దర్శనమిస్తుండడం ఈ లెక్కల్లో డొల్లతనాన్ని బయటపెడుతోంది.

కారణాలు అనేకం..

వాస్తవానికి అధికశాతం మంది నివాసాలు మొదలు పెట్టక పోవడానికి అనేక కారణాలు కనిపిస్తున్నాయి. కరోనా సమయం నుంచి ఆర్థిక పరిస్థితులు అంతంతమాత్రంగానే ఉండడం, నిర్మాణ సామగ్రితో పాటుగా కూలీల రేట్లకు రెక్కలు రావడం ప్రధానంగా కనిపిస్తోంది. ప్రభుత్వం తొలుత గృహ నిర్మాణదారులకు మూడు ఆప్షన్లను ఇచ్చింది. వినియోగదారుడు తనకు కావాల్సిన విధంగా నిర్మించుకుంటే దానికి తగిన విధంగా బిల్లులు మంజూరు చేయడం ఒకటి కాగా, ప్రభుత్వం ఇచ్చిన మెటీరియల్‌తో ఇంటి నిర్మాణం చేపట్టేలా రెండో ఆప్షన్ ఉంది. ఇక మూడోది ప్రభుత్వమే ఇంటిని నిర్మించి అప్పగించేలా అంగీకార పత్రాలను కూడా తీసుకుంది. ఇందులో దాదాపుగా 80 శాతం మందికి పైగా ప్రభుత్వమే ఇల్లు నిర్మించి తమకు అప్పగించేలా వినియోగదారులు అంగీకరించారు. దానికి గానూ వాలంటీర్లు చెప్పిన విధంగా బ్యాంకుల్లో ఖాతాలను కూడా తెరిచారు. కానీ ఇది జరిగి నెలలు గడుస్తున్నా దానికి సంబంధించిన పనులు ఒక్కటి కూడా ప్రారంభం కాలేదని చెప్పాలి. ఆ తర్వాత మూడో ఆప్షన్‌ను ప్రభుత్వం తొలగించింది. దీంతో చాలామంది లబ్ధిదారులు అసలు తమకు ప్రభుత్వం ఇంటిని మంజూరు చేసిందనే విషయాన్ని కూడా మర్చిపోయే పరిస్థితి నెలకొంది. దానికి తోడు గృహాలకు సంబంధించి పదేపదే సమావేశాలను నిర్వహించడం కూడా లబ్ధిదారులకు విసుగును తెప్పిస్తోంది.

అధ్వానంగా లేఅవుట్లు..

ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలోని చాలా లేఅవుట్లు బురదమయంగా మారాయి. కొన్ని లేఅవుట్లలో నీరు చేరి చెరువులను తలపించాయి. రోడ్లు కూడా బురదమయంగా మారాయి. చాలాచోట్ల లేఅవుట్లలో ఇంకా రోడ్లు, డ్రెయినేజీలు, విద్యుత్ వంటి పనులు సాగుతున్నాయి. ఈ పనులను పూర్తి చేసిన తర్వాతే నివాసాల పనులను చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

బంగారమైన ఇసుక..

హిందూపురం పట్టణంతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా ఇసుక బంగారమయింది. దీంతో ఇళ్ల నిర్మాణాలకు ఇసుక పూర్తి స్థాయిలో దొరక్క లబ్ధిదారులతో పాటు గుత్తేదారులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్సీ షేక్ మొహమ్మద్ ఇక్బాల్ ఉమ్మడి జిల్లా కలెక్టర్లతో చర్చించారు. అయినప్పటికీ అధికారం యంత్రాంగం పూర్తిస్థాయిలో ఇసుకను సరఫరా చేయడంలో విఫలమయింది. పూర్తిస్థాయిలో ఇసుక లభ్యం కాకపోవడంతో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం కావడం లేదు.

ఒత్తిడి భరించలేకపోతున్న అధికారులు..

పాలకులు, ఉన్నతాధికారులు సమీక్ష సమావేశాలు నిర్వహించి ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని గృహ నిర్మాణ శాఖ అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. అయితే జగనన్న కాలనీల్లో కనీస సౌకర్యాలు కల్పించకపోతే లబ్ధిదారులు ముందుకు రావడం లేదని, ఇసుక పూర్తిస్థాయిలో లభ్యం కావడం లేదని, పెరిగిన ధరలకు అనుగుణంగా అంచనాలను సైతం పెంచి లబ్ధిదారులకు ఇస్తే తప్ప వారు నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకురారని గృహ నిర్మాణ శాఖ అధికారులు వాపోతున్నారు. అయితే ఈ విషయాలను సమీక్ష సమావేశంలో అధికారులకు చెప్పలేకపోతున్నారు. అధికారుల ఒత్తిడికి చాలామంది అధికారులు సెలవులపై, బదిలీలపై వెళ్లడానికి సిద్ధమవుతున్నారు.



దుకాణాల ముందే మద్యం తాగుతున్న మందుబాబులు... మూతపడ్డ దుకాణాలు

మున్సిపల్ కాంప్లెక్స్‌లో మద్యం షాపు

మందుబాబుల చేష్టలతో 12 దుకాణాలు మూత

తొలగింపునకు నోటీసులు ఇచ్చినా స్పందించని వైన్‌షాపు నిర్వాహకుడు

ప్రజాశక్తి-గుత్తి

గుత్తి పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా ఉన్న మున్సిపాల్టీ వాణిజ్య సముదాయంలోని గదిలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణంతో పక్కనున్న దుకాణదారులు ఇబ్బందులు పడుతున్నారు. కాంప్లెక్స్‌లో 20 దుకాణాలు ఉన్నాయి. ఒక్కో గదికి రూ.1470 అద్దె మున్సిపాలిటీకి చెల్లించేలా 20 మంది దుకాణాదారులు వ్యాపారాలు ప్రారంభించారు. మున్సిపాలిటీ చట్ట ప్రకారం వాణిజ్య సముదాయాల్లో మద్యం, మాంసం దుకాణాలు ఏర్పాటు చేయరాదు. నిబంధనలను బేఖాతరు చేస్తూ ఓ దుకాణ నిర్వాహకుడు రెండేళ్ల క్రితం వైన్ షాపుకు సబ్ లీజ్‌కు ఇచ్చాడు. వైన్ షాపుకు వచ్చేవారు మద్యం కొనుగోలుచేసి పక్కనే ఉన్న దుకాణాల ఎదురుగా బైఠాయించి సేవిస్తున్నారు. కేకలు పెడుతూ.. అల్లరి చేస్తూ గొడవ పడుతున్నారు. బాటిళ్లను అక్కడే పడేస్తున్నారు. మరికొందరు పగలగొడుతున్నారు. దుకాణాల ముంతదు అపరిశుభ్రం చేయడంతో పాటు వెలికి చేష్టలకు పాల్పడుతున్నారు. దీంతో వైన్ షాపు పక్కన ఉన్న దుకాణాలకు ప్రజలు వ్యాపారానికి రావడం లేదు. వ్యాపారాలు లేకపోవడంతో దుకాణాలను మూసివేశారు. సమస్యను దుకాణదారులు ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం శూన్యం. నెలనెలా అద్దెలు చెల్లించని పక్షంలో మున్సిపల్ అధికారులు జరిమానా విధిస్తున్నారని వాపోతున్నారు. వ్యాపారాలు చేసుకుంటూ జీవనం కొనసాగించే తాము రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైన్ షాపు తొలగించాలని నిర్వాహకుడికి నోటీసులు ఇచ్చి బాడుగను రద్దు చేశామని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. అయినా అతను స్పందించడం లేదని అంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మద్యం దుకాణాన్ని అక్కడ నుంచి తొలగించాలని బాధిత దుకాణదారులు కోరుతున్నారు.

సీఎంవో అధికారినంటూ టోకరా

అధికారులతో డబ్బులు గుంజేందుకు ప్రయత్నించిన ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-అనంతపురం

ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) అధికారులమంటూ అధికారులతో డబ్బులు గుంజేందుకు ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులను అనంతపురం పోలీసులు పట్టుకున్నారు. వన్‌టౌన్ పోలీసులు ఆ ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి కటకటాల వెనక్కు పంపారు. అనంతపురం డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లాకు హయత్‌నగర్‌కు చెందిన రాయబండి సూర్యప్రకాష్ ఆచారి, దవులురి ప్రసాద్‌లు తాగుడుకు బానిసయ్యారు. వ్యసనాల కోసమని సులువుగా డబ్బు సంపాదించేందుకు గానూ సీఎంవో అధికారులుగా అవతారమెత్తారు. తాము సీఎంవో కార్యాలయంలో పనిచేస్తున్నాం సమావేశాల నిర్వహణ ఖర్చు, మీడియా వారికి అయ్యే ఖర్చు ఇతర ఖర్చులున్నాయని జిల్లా అధికారులకు ఫోన్లు చేసి డబ్బు అడిగేవారు. గూగుల్, ఫోన్‌పేల ద్వారా డబ్బులు వేయాలని అధికారులను అడుగుతూ ఉండేవారు. ఈ రకంగా అనంతపురం జిల్లాలోనూ డిప్యూటీ ట్రాన్సుపోర్టు కమిషనర్ ఎస్.శివరాం ప్రసాద్‌కూ సీఎంవో అధికారినంటూ నమ్మబలికి ఫోన్ చేశారు. ఆయనకు అనుమానం వచ్చి వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు వెంటనే రంగంలో దిగి విచారించగా వీరిద్దరి మోసాలు బయటపడ్డాయి. వారిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. వారిని విచారించగా వీరిపై ఇటువంటి కేసులు ఇది వరకే పది నమోదయినట్టు గుర్తించారు. ఈ కేసులో మొదటి నిందితుడు అయిన సూర్య ప్రకాష్ ఆచారిపై రౌడీషీట్ ఓపెన్ చేశారు. ఈ సమావేశంలో వన్‌టౌన్ సిఐ రవి శంకర్‌రెడ్డి, ఎస్ఐ గౌస్‌బాషా సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

గొర్రెల పెంపక కేంద్రం స్థలం కేటాయింపులో మార్పు

పరిశీలన అనంతరం అహుడాకు కేటాయించిన భూమి మార్పు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

గొర్రెల పెంపక కేంద్రంలోని స్థలాన్ని అహుడాకు కేటాయింపుకై స్థల పరిశీలనకు అధికారులు శుక్రవారం విచ్చేశారు. పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ అమరేందర్, సత్యసాయి జిల్లా కలెక్టరు బసంత్‌కుమార్‌లు కేంద్రాన్ని పరిశీలించారు. 1959లో ఏర్పాటైన ఈ కేంద్రానికి 600 ఎకరాల భూమిని ఆనాడు కేటాయించియున్నారు. ఇప్పుడు స్థలాన్ని క్రమక్రమంగా ఇతర అవసరాలకు కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం చేస్తూ వెళ్తోంది. ఇది వరకే వైద్య కళాశాలకు ఇందులో నుంచే 50 ఎకరాలు కేటాయించారు. తాజాగా మరో 51.52 ఎకరాలను అహుడాకు కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం చేసింది. అయితే గొర్రెల పెంపక కేంద్రం కోసం కేటాయించిన ఈ స్థలాన్ని ఇతర అవసరాలకు కేటాయించడంపై అధికారులు అభ్యంతరం వ్యక్తం చేసియున్నారు. ఈ నేపథ్యంలో దీనిపై క్షేత్రస్థాయి పరిశీలనకు పశు సంవర్ధక శాఖ డైరెక్టరు, జిల్లా కలెక్టరు విచ్చేశారు. ఈ సందర్భంగా పశు సంవర్ధక శాఖ అధికారులు కూడా అహుడాకు ముందుగా అనుకున్న ప్రకారం భూమిని కేటాయిస్తే మధ్యలో పెంపకం కేంద్రం గోడౌన్, ఫార్మ్‌కు మధ్య రహదారి కూడా లేకుండాపోతుందని తెలిపారు. ఏదైనా అవసరమైన దాణా సరఫరా చేసుకోవాలంటే ప్రధాన రహదారిపైకి వచ్చి తిరిగి తీసుకెళ్లాల్సి ఉంటుందని చెప్పారు. అంతేకాకుండా ఇప్పుడు కేటాయించిన భూమి మొత్తం గుట్టలతో కూడి ఉండటంతో అహుడా దాన్ని అభివృద్ధి చేయడానికి నిధులు అదనంగా ఖర్చు అవనున్నాయన్న అంశాన్ని అధికారులు భావించారు. ఇప్పుడు కేటాయించినది కాకుండా ఇది వరకు వైద్య కళాశాలకు కేటాయించిన భూమి పక్కనే, అదే సర్వే నంబరులో ప్రధాన రహదారికి ఆనుకునివున్న 20 ఎకరాలు అహుడాకు కేటాయిస్తే వారికి ప్రయోజనకరంగా ఉంటుందన్న అభిప్రాయానికి అధికారులు వచ్చారు. దీంతో ఇప్పుడు కేటాయించినది కాకుండా వైద్యకళాశాల పక్కన కేటాయించే విధంగా ప్రభుత్వానికి మరో ప్రతిపాదన పంపించాలన్న నిర్ణయానికి అధికారులొచ్చినట్టు సమాచారం. దీంతో కొంత భూమిని గొర్రెల పెంపక కేంద్రం కోల్పోయిన నష్టం కొంత వరకు తగ్గే అవకాశముంది. ఈ రకంగా క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం మార్పులు, చేర్పులు చోటు చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏది ఏమైనా ఇప్పటి వరకున్న పెంపక కేంద్రం భూమిని రోజురోజుకూ ఇతర అవసరాలకు కేటాయిస్తూ పోతుండటంతో జిల్లాలో పెంపకందారులు అధికంగానున్న ఇటువంటి చోట కొత్త మేలు రకంగా గొర్రెలు ఉత్పత్తి చేయడానికున్న అవకాశాలను కోల్పోయే పరిస్థితులు వస్తున్నాయన్న ఆందోళన మాత్రం సర్వత్రా వ్యక్తమవుతోంది. స్థల పరిశీలనలో పశుసంవర్ధక శాఖ జెడి సుబ్రమణ్యం, తహశీల్దారు స్వర్ణలత, అహుడా అధికారి చిన్నయ్య, పశు సంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు.



క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న పశుసంవర్ధక శాఖ డెరెక్టరు, కలెక్టరు

కౌలు రైతులను ఆదుకోవటంలో విఫలం

సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

కౌలు రైతులను ఆదుకోవటంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ విమర్శించారు. రాష్ట్ర కౌలు రైతుల తృతీయ మహాసభలకు సంబందించిన పోస్టర్లను శుక్రవారం మండల పరిధిలోని యనమల పల్లి సిపిఎం కార్యాలయంలో సిపిఎం నాయకులు, రైతు సంఘం నాయకులు ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ మాట్లాడుతూ ఈనెల 21న విజయవాడలో నిర్వహించనున్న ఈ మహాసభలకు సిపిఎం రైతు సంఘం నాయకులు కార్యకర్తలు అధికసంఖ్యలో తరలి వచ్చి మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఎన్టీఆర్ సర్కిల్ నుండి మహా ప్రదర్శన ఉంటుందని తెలిపారు. గత పది సంవత్సరాల నుండి రాయలసీమ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వారిని ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. కౌలు రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌలు రైతుసంఘం నాయకులు కదిరప్ప, ప్రవీణ్, పైపల్లి గంగాద్రి, శ్రీనివాసులు, గౌస్ లాజమ్, రమేష్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

కాంపౌండర్లే పశువైద్యులు

ప్రజాశక్తి - లేపాక్షి

లేపాక్షి మండలంలో పశువైద్యశాఖలో కాంపౌండర్లే పశువైద్యుల అవతారం ఎత్తారు. మండల వ్యాప్తంగా పశువులకి ముద్ద చర్మవ్యాధి విజృంభిస్తోంది. ముద్ద చర్మవ్యాధి బారిన పడిన పశువుల ను కాపాడుకునేందుకు రైతులు నానా పాట్లు పడుతున్నారు. ఈ నేపథ్యంలో పశువైద్యశాలకు నిత్యం పదులసంఖ్యలో పశువులు వస్తున్నాయి. ఇక్కడ ఏడీ, డాక్టర్ ఇద్దరిని నియమించిన వీరు మాత్రం అందుబాటులో ఉండటం లేదు. మీటింగులు, అడిట్లు అని విధులకు డుమ్మాకొడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో పశు వైద్యశాఖ కార్యాలయానికి తీసుకువచ్చే పశువులకు కాంపౌండర్లే చికిత్స చేస్తున్నారు. దీంతో రైతులు కూడా కాంపౌండర్లనే డాక్టర్లుగా భావిస్తున్న పరిస్థితి నెలకొంది. మండల వ్యాప్తంగా ముద్ద చర్మ (లంపిస్కీన్) వ్యాధితో, జ్వరాలతో దాదాపు 10 పశువులు మృత్యు వాత పడినట్లు తెలుస్తుంది. ఇలాంటి పరిస్థితులలో కూడా పశువైద్యశాఖ వైద్యులు అందుబాటులో లేకపోవడం ఆందోళనను కలిగిస్తోంది. ప్రభుత్వ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ప్రయివేటు వైద్యులను ఆశ్రయిస్తూ వేలాది రూపాయలు ఖర్చు చేసుకుంటున్నారు. మెడికల్ క్యాంపులు పెట్టి గ్రామాల్లో వాక్సినేషన్ కార్యక్రమాలు ఎప్పుడు ఎక్కడ నిర్వహిస్తున్నారో కూడా పాడి రైతులకు తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైన సంబందిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి పశువైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు కోరుతున్నారు.



పశువుకు వైద్యం చేస్తున్న కంపౌండర్

ప్రమాదకర అటవీ ప్రాంతంలో

విద్యార్థినులతో పనులు

ప్రజాశక్తి - చిలమత్తూరు

కార్తీకమాస వనభోజనాల పేరిట విద్యార్థినులతో పలుగు పార పట్టించి పనులు చేయిస్తున్నారు. టేకులోడు గురుకుల పాఠశాలలో విద్యార్థులను విద్యావంతులుగా మార్చాల్సిన ఉపాధ్యాయులు కూలీలుగా మారుస్తున్నారన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కూలీలను పెట్టి పని చేయించుకుంటే ఖర్చు అవుతుందని కక్కుర్తి పడి చిన్నారుల చేతులకు కాయాలు కాసే పనులు చేయిస్తున్నారు. ఒకవైపు 14 సంవత్సరాల లోపు విద్యార్థులకు ఉచిత నిర్భంద విద్యను అందించాలి. 18 సంవత్సరాల లోపు చిన్నారులకు బాలకార్మికుల నిర్మూలన చట్టం అమలు చేయల్సి ఉంది విద్యా బుద్దులు నేర్పాల్సిన ఉపాధ్యాయులే చట్టాన్ని తుంగలో తొక్కుతున్నారు. ఆదర్శంగా పేరుపొందిన టేకులోడు మహాత్మా జ్యోతిరావుపూలే పాఠశాలలో 7 వ తరగతి చదువుతున్న సుమారు 80 మంది విద్యార్థినులను పాఠశాలకు సుమారు కిలో మీటరు దూరంలో ఉన్న పొలంరాజు గుడి వద్దకు ఎర్రటి ఎండలో నడిపించి అటవీ ప్రాంతంలో ఉన్న పొలంరాజు గుడివద్ద పిచ్చి మొక్కలు రాళ్లు ముళ్ల కంపలను వారిచేత తొలగించే కార్యక్రమాన్నిశుక్రవారం చేపట్టారు. అసలే అటవీ ప్రాంతం ప్రమాదకర పాములు, విషకీటకాలతో పాటు అడవిపందులు వంటి వాటి వల్ల ప్రమాదం వాటిల్లే ప్రమాదం ఉంది. వీటితో పాటు పలుగు గడ్డపార చేతపట్టించి పనులు చేయిస్తున్నారు. వాటిని ఎలా వాడాలో కూడా తెలియని బాలికలతో ఆ పనులు చేయిస్తే ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది.సరిగ్గా పాఠ్యాంశాల బోధన జరిగే సమయంలో గురుకులంలో పాఠ్యాంశాలను వినాల్సిన విద్యార్థినులతో కూలీలతో మాదిరి పనులు చేయిస్తున్నారు. ఎందుకు ఇలా చేయిస్తున్నారని అడిగితే కార్తీక వనభోజనాల కార్యక్రమం కోసం ఈ పనులు చేయిస్తున్నామని ఆర్భాటంగా చెప్పుకొచ్చారు. అలా అయితే ఎవరైన కూలీలతో పని చేయించాలి కాని విద్యార్థినులతో చేయించడం ఏంటని విద్యార్థి సంఘాల నాయకులు మండిపడితున్నారు. దీనిపై సంబందిత శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



పనులు చేయడానికి పలుగు, పార తీసుకెళుతున్న విద్యార్థినులు

తక్కువ వడ్డీకే రుణాలు : ఎడిసిసి ఎజిఎం

గుడిబండ : తమ బ్యాంకు పరిధిలోని వినియోగదారులకు అతి తక్కువ వడ్డీతోనే రుణాలు అందిస్తున్నామనిఎడిసిసి బ్యాంక్ ఎజిఎం తేజస్విని పేర్కొన్నారు. ఆమె గురువారం గుడిబండ ఎడిసిసి బ్యాంకును సందర్శించారు. ఈ సందర్భంగా బ్యాంకులో పలు రికార్డులను పరిశీలించారు. లావాదేవీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇతర బ్యాంకుల కన్నా ఎడిసిసి బ్యాంకులో రైతులకు తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిసిసి బ్యాంక్ బ్రీఫ్ మేనేజర్ దుర్గాప్రసాద్, మడకశిర మార్కెట్ యార్డ్ చైర్మన్ జయ రామప్ప, సెక్రటరీ రాజప్ప, బ్యాంక్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉచిత కంటివైద్యశిబిరం

చిలమత్తూరు : మండలంలోని దేమకేతేపల్లిలో శుక్రవారం చేపట్టిన వివిధ కార్యక్రమాలలో సర్పంచ్ ఈడిగ తిరుమలేష్ పాల్గొన్నారు. గ్రామంలో స్టేట్ బ్యాంక్ ఎదురుగా ప్రముఖ వైద్యులు జంకా కృష్ణ మోహన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి శిబిరాన్ని సర్పంచ్ ప్రారంభించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో మండల వైద్యాధికారి తేజస్విని ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో సర్పంచ్ పాల్గొన్నారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంప్‌ను ప్రారంభించారు.

గాండ్లపెంట ఎంపీడీవోగా అంజనప్ప

గాండ్లపెంట : గాండ్లపెంట ఎంపీడీవోగా డి.అంజనప్ప శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. సీనియర్ అసిస్టెంట్ హమీద్‌బాషా, జూనియర్ అసిస్టెంట్ రమేష్ రెడ్డి, టైపిస్ట్ జయ చంద్రారెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ జయసింహ తదితరులు నూతన ఎంపిడిఒకు స్వాగత పలికారు.

అంగన్వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ

కొత్త చెరువు : లో మండల కేంద్రంలోని రెండు అంగన్వాడీ కేంద్రాలను అవసరమైన భవనాల నిర్మాణాలకు ఎంపిపి గాయత్రి రెడ్డప్ప రెడ్డి, సర్పంచ్ రాధా నాగరాజు శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గంగాదేవి శంకర, వైసిపి నాయకులు వాల్మీకి శంకర్, భాస్కర, బళ్ళారి బాబు, మస్కూరు ప్రసాద్, అంగన్వాడీ టీచర్లు ఉమాదేవి, షర్మిల తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఆధార్ సేవలు

బుక్కపట్నం : గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం సచివాలయం ద్వారా ఆధార్ సేవలను ప్రారంభించిందని ధర్మవరం డిఎల్‌డిఒ శివారెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని మారాల గ్రామ సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండేలా సచివాలయాల ద్వారా ఆధార్ సేవలను ప్రభుత్వం తీసుకొచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయంలోని పలు రికార్డులు పరిశీలించి, సచివాలయ సిబ్బంది పనితీరు , ఆధార్ సెంటర్ వినియోగంపై పలు సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, ఈవోఆర్డీ ఇందిరాబాల, హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : ఆధార్ కార్డు నమోదు చేసుకునేందుకు శుక్రవారం నుంచి ప్రత్యేక క్యాంపులను ప్రారంభించినట్లు ఎంపీడీవో సాయి మనోహర్ తెలిపారు. 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకు నిర్వహించిన గ్రామ సచివాలయాలు, పాఠశాలల్లో ఆధార్ నమోదు, డాక్యుమెంట్ అప్డేట్ చేసుకునే కార్యక్రమం ఉంటుందన్నారు. మండలంలోని ఆధార్ నమోదు చేయించుకోని వారు, విద్యార్థులు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విద్యార్థినులకు విద్యాసామగ్రి అందజేత

ధర్మవరం టౌన్ : ప్రత్యేక అవసరాల పిల్లలకు (మానసిక వికలాంగులు) ట్రైనింగ్ కళాశాల(బీఈడీ) డీఎస్పీ మల్లికార్జున వర్మ విద్యాసామగ్రిని అందజేశారు. అమెరికా నెట్ వర్క్స్ సంస్థ సౌజన్యంతో ఎన్జీఓ సేవాసమితి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలపిల్లలకు విద్యాసామగ్రిని డీఎస్పీ అందజేశారు. ఈ కార్యక్రమం లో ఎన్జీఓ సేవాసమితి వ్యవస్థాపకులు కమలనాథ్, సభ్యులు జీవీరమణ, నవీన్, పాఠశాల హెచ్ఎం ఆర్పీ, కేపీరాజు, తోటనాగరాజు సుంకర రమేష్, సుధాకర్, మంజునాథ్ పాల్గొన్నారు.

భూ రీసర్వేపై జేసీ ఆరా

సోమందేపల్లి: మండలంలో జరుగుతున్న భూ సర్వేను జాయింట్ కలెక్టర్ చేతన్ శుక్రవారం పరిశీలించారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో చేపట్టిన రీ సర్వే కార్యక్రమాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడారు. రీసర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, తహశీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఈవోఆర్డీ నాగరాజు రావ్, మండల సర్వేయర్ కరుణాకర్, పంచాయతీ కార్యదర్శులు కృష్ణప్రసాద్, నాగముని, వీఆర్వో వెంకటేష్, సర్పంచ్ నరసింహమూర్తి, సింగిల్ విండో చైర్మన్ కొల్లప్ప, వైసిపి నాయకులు మరుతి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై మహిళలకు అవగాహన

రొద్దం : టింబక్టిన్ కలెక్టివ్ సంస్థ ఆధ్వర్యంలో చట్టాలపై మహిళలకు అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. సంస్థ సిఐఒ లావణ్య, ఆర్యక్షులు కృష్ణమ్మ మాట్లాడుతూ మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ రామలక్ష్మమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా తెప్పోత్సవం

బుక్కపట్నం : స్థానిక చెరువులో లక్ష్మీనారాయణ స్వామి తెప్పోత్సవాన్ని కనుల పండువగా శుక్రవారం నిర్వహించారు. ప్రతి ఏటా చెరువులో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని తెప్పోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా గ్రామ పురోహితులు హరి స్వామి, గౌతమ్ స్వామి, లక్ష్మీనారాయణ స్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామ పురవీధుల్లో ఊరేగించి అనంతరం స్థానిక చెరువులో తెప్పోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చెరువులో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కార్తీకదీపాలు వెలిగించారు. ఈ కార్యక్రమంలో సిఐ జయ నాయక్, సర్పంచ్ నాగలక్ష్మి రాజు, తహశీల్దార్ నటరాజ్, ఎస్ఐలు నరసింహుడు, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతి నిలయంలో అన్నప్రసాదం

పుట్టపర్తి అర్బన్ : సత్యసాయి 97వ జయంతి వేడుకలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వేలాదిమందికి మధ్యాహ్నం, రాత్రి ఉచిత భోజన ప్రసాద పంపిణీకి ట్రస్టు శ్రీకారం చుట్టింది. మేనేజింగ్ ట్రస్టీ ఆర్ జె రత్నాకర్, ట్రస్టు సభ్యులు ఈ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ప్రశాంతి నిలయంలోని వెస్ట్ గేట్ సమీపంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈనెల 24 వరకు ఈ పంపిణీ కార్యక్రమం కొనసాగుతుంది. వెజిటబుల్ పలావ్, చపాతి, పెరుగన్నం, ప్రసాదంగా అందజేసి పంపిణీ చేస్తున్నారు. ప్రతి ఏటా బాబా జయంతి వేడుకలు సందర్భంగా అన్న ప్రసాదాలు పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తోంది.

ఎడిజె తిరుమలరావుకు ఘన సన్మానం

హిందూపురం : హిందూపురం ఇన్‌ఛార్జి అదనపు జిల్లా న్యాయమూర్తిగా పని చేసిన తిరుమలరావును శుక్రవారం స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ కేసుల పరిష్కారంలో ఎడిజె తిరుమల రావు చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు శ్రీధర్, సుందరం, రాజ్యలక్ష్మి, ఆనంద్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నాగప్ప, సుదర్శన్, ఎపిపి ఇందాద్, న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

పెనుకొండ డీఎస్పీగా హుసేన్‌పీరా

పెనుకొండ : పెనుకొండ డీఎస్పీగా హుసేన్‌పీరా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న రమ్యను ప్రభుత్వం ఏసీబీ డీఎస్పీగా బదిలీ చేయడంతో ఆమె స్థానంలో హుసేన్‌పీరా బాధ్యతలు స్వీకరించారు. నూతన డీఎస్పీకి డివిజన్‌లోని సిఐలు, ఎస్ఐలు, పోలీసులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి

జిల్లాలోని ఆయా మండలాల్లో శుక్రవారం జరిగిన మండల సర్వసభ్యసమావేశాలు వాడివేడీగా సాగాయి. పలు సమస్యలపై సభ్యులు అధికారులను నిలదీశారు. గత సమావేశాల్లో చర్చించిన సమస్యలు కూడా పరిష్కారానికి నోచుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కారం కాకపోవటంతో తాము గ్రామాల్లో తిరగలేకపోతున్నామని వాపోయారు.

గోరంట్ల : మండల కేంద్రంలో ఎంపీపీ ప్రమీల అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం వాడివేడీగా సాగింది. అధికారుల పనితీరుపై సర్పంచులు ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో ప్రభుత్వ కార్యక్రమాలు జరిగినప్పుడు అధికారులు ప్రజాప్రతినిధులకు తెలుపకుండా గోప్యంగా జరపడంపై అర్థం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం నుండి అందుతున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందజేసేటప్పుడు కనీసం సర్పంచుకైనా తెలియజేయకుండా ఉద్యోగులే లబ్ధిదారులకు అందజేస్తున్నారు. బూదిలి గ్రామంలో మంజూరైన జగనన్న గృహాల లబ్ధిదారుల జాబితాలను ఎందుకు తొలగించారనిమార్కెట్ యార్డ్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి హౌసింగ్ ఏఈ నిలదీశారు. విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని బూదిలి సర్పంచ్ రామాంజనేయులు విద్యుత్‌శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా పలు సమస్యలపై ఆయా గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ జయరామ్ నాయక్, మండల అగ్రి అడ్వైజర్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, వైస్ ఎంపిపి నాగభూషణ్‌రెడ్డి, ఎంపీడీవో రఘునాథ్‌తో పాటు ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

తలుపుల : మండల స్థాయి అధకారుల తీరుపై ఎంపిపి మహ్మద్‌రఫీ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మండలకేంద్రంలో ఎంపిపి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో అధికారుల తీరుపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల వ్యాప్తంగా సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించకడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల పనితీరు మెరుగు పడాలన్నారు. పనితీరు మారకపోతే కలెక్టర్ దృష్టికి తీసుకెళతానని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండలంలోని ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

క్రీడలతో గుర్తింపు

ప్రజాశక్తి-హిందూపురం

విద్యతో పాటు క్రీడల్లో రాణించినప్పుడే మంచి గుర్తింపు లభిస్తుందని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వర రావు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎంజిఎం క్రీడా మైదానంలో అండర్ -17 వాలీబాల్ అనంతపురం, పుట్టపర్తి జిల్లా స్థాయి పోటీలు, జిల్లా జట్లు ఎంపిక జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతు విద్యార్థులతో పాటు యువకులు క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంజిఎం పాఠశాల హెచ్ఎం సామ్రాజ్యం, రాష్ట్ర వ్యాయమ ఉపాధ్యాయ సంఘ ఉపాధ్యక్షులు నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు అధ్యక్షులు మురార్జీ యాదవ్, విశ్రాంత పిడిలు ప్రభుకుమార్, అశ్వర్థప్ప, బ్రహ్మయ్య, జిల్లా వాలీబాల్ సంఘ ఉపాధ్యక్షులు రామాంజినేయులు, హిందూపురం వాలీబాల్ అధ్యక్షులు వెంకటేష్, కార్యదర్శి మహేష్ దీపక్, స్థానిక పిడిలు లోకేష్, సురేష్, వివిధ పాఠశాలల పిడిలు, క్రీడా కారులు పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న కమిషనర్

రాష్ట్రస్థాయి పోటీలకు ధర్మవరం విద్యార్థులు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

హిందూపురంలో గురువారం జరిగిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు రూపరాజ పిపిఎంఆర్ పాఠశాల చైర్మన్ హర్షవర్ధన్ తెలిపారు. మండలంలోని నాగలూరు వద్దఉన్న రూపరాజపీసీఎంఆర్ పాఠశాలలో 10వతరగతి చదువుతున్న పవన్‌కుమార్, లిఖిత్‌కుమార్ జిల్లాస్థాయి పోటీలలో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో విద్యార్థులను పాఠశాల చైర్మన్ తోపాటు డైరెక్టర్లు రూపరాజకృష్ణ, జగదీశ్, కరస్పాండెంట్ నాగమోహన్‌రెడ్డి, ప్రిన్సిపల్ శైలజారెడ్డి అభినందించారు. అదేవిధంగా పాఠశాలలో 7వతరగతి చదువుతున్న జ్ఞానసాయి బెంగుళూర్‌లో శ్రీవాగ్దేవి విద్యాసం గీత కళానృత్య సంస్కృతి సంస్థ నిర్వాహకులు నిర్వహించిన కార్తీక నృత్యోత్సవం జిల్లాస్థాయి పోటీలలో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో పాఠశాల చైర్మన్ తోపాటు డైరెక్టర్లు అభినందించారు.





చెకుముకి టాలెంట్ టెస్టుతో బాలలకు మనోవికాశం

హిందూపురం : బాలల మనోవికాశం కోసమే జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నట్లు జెవివి జిల్లా కార్యదర్శి డాక్టర్ ఈటి రామ్మూర్తి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని అల్ హి లాల్ పాఠశాలలో జెవివి ఆధ్వర్యంలో మండల స్థాయి టాలెంట్ టెస్టు నిర్వహించారు. అంతకు ముందు జెవివి నాయకులతో కలిసి మండల విద్యాశాఖ అధికారి గంగప్ప, డాక్టర్ ఈటి రామ్మూర్తి, పాఠశాల హెచ్ఎం అక్బర్ షరీఫ్, బాలికల కళాశాల ప్రిన్సిపల్ మురళిమోహన్, పాఠశాల ఉపాధ్యాయులు ప్రశ్న పత్రాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు రామకృష్ణ, నరసింహులు, రవీంద్రారెడ్డి, ఉగ్రప్ప, పెన్నయ్య, అబ్దుల్ హక్, కమల, మంజుళ, రఫీక్ ఆహ్మద్, హరిరామ్, చంద్రకళ, ఆంజినేయులు, మురళి మోహన్, దిల్‌రుబ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : పెనుకొండ మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ ను ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఎంఇఒ పెనుకొండ డివిజన్ జిల్లా ఉప విద్యాశాఖధికారి రంగస్వామి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమం జానవిజ్ఞాన వేదిక జోనల్ కన్వీనర్, సుధాకర్, నరేష్, ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ పరీక్షల్లో ప్రతిభ కనపర్చిన వారిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేణు, వీరాంజనేయులు, ఉమాదేవి, లక్ష్మీకాంతమ్మ, ఆంజనేయులు, సతీష్, ప్రభాకర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : పట్టణంలోని ఎన్జీవో హోంలో జేవీవీ ఆధ్వర్యంలో మండలస్థాయి చెకుముకి సైన్సు సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా సైన్సు సెంటర్ అధికారి ఆనంద్‌భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సైన్సు పట్ల అవగాహన పెంపొందించుకోవాలన్నారు. జెవివి జిల్లా ప్రధానకార్యదర్శి డాక్టర్ ఆదిశేషు మాట్లాడుతూ అనేక సమస్యలను పరిష్కారం చూపేది ఒక్కసైన్సు మాత్రమేనన్నారు. అనంతరం ప్రశ్నపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జెవివి గౌరవాధ్యక్షులు డాక్టర్ బషీర్, చెకుముకి జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు నరేంద్రబాబు, లోకేష్, సురేష్, ఉపాధ్యాయులు శేఖర్, జిలానీ, తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : వేమన ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక కదిరి శాఖ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల స్థాయి చెకుముకి పరీక్షలను శుక్రవారం నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనపర్చిన వారిని జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేమన ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అమడగూరు ఎంఇఒ జాన్ రెడ్డప్ప, జెవివి నాయకులు వీరస్వామి, సుబ్బారెడ్డి, రమేష్, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, ప్రసన్న ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ ను శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. 5 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, గురుకులం, కేజీబీవీ నుండి మొత్తం 21 మంది విద్యార్థులు ఈ పరీక్షల్లో పాల్గొన్నారు. మండల స్థాయిలో నిర్వహించిన టాలెంట్ టెస్టులో ప్రతిభ కనపర్చిన వారిని జిల్లా స్థాయికి ఎంపిక చేశామని ఉపాధ్యాయులు అలీముల్లా, శ్రీనివాసులు, లక్ష్మిపతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జయప్రద, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టను స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్న ఉన్నత పాఠశాలలో హెచ్ఎం నాగరత్నమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులుచ విద్యార్థులు పాల్గొన్నారు.

లేపాక్షి : మండల కేంద్రంలో శుక్రవారం నీలం సంజీవరెడ్డి ఓరియంట్ పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థుల కు చెకుముకి పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో ప్రతిభ కనపర్చిన వారిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఆదినారాయణ, వైస్ ఎంపీపీ ఆంజనరెడ్డి, ఉపాధ్యాయులు హనుమంతు, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి పెనుకొండ రూరల్


గ్రామ సచివాలయ ఉద్యోగులు ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలు అందించాలని కలెక్టర్ బసంత్ కుమార్ అన్నారు శుక్రవారం మండల పరిధిలోని ఎర్రమంచి, మునిమడుగు, దుద్దేబండ గ్రామాలలోని గ్రామ సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. కార్యాలయాల్లోని రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన ఉద్యోగులతో మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చే వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. దరఖాస్తులు ఎటువంటి పరిస్థితుల్లో పెండింగ్లో ఉండకూడదన్నారు. గ్రామ సచివాలయం అందించే సేవల గురించి ప్రజలకు ఎప్పటికప్పుడు వివరించాలన్నారు. అదేవిధంగా ఉద్యోగులు అన్ని పనివేళల్లో తప్పనిసరిగా గ్రామ సచివాలయంలో ఉండాలన్నారు. మధ్యాహ్న భోజన సమయంలో సైతం సచివాలయంలోని ఉండేలా చూడాలన్నారు. ఉద్యోగుల హాజరు 40 శాతం తగ్గకుండా చూడాలన్నారు. ఉద్యోగులు తప్పనిసరిగా డ్రెస్ కోడ్ పాటించాలన్నారు. డ్రెస్ కోడ్, హాజరు శాతం తక్కువగా ఉన్న ఉద్యోగులకు మెమోలు జారీ చేయాలని ఎంపీడీవో శివశంకరప్పను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

టీకాలు నిర్దిష్ట సమయంలో పూర్తిచేయాలి

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా పశువులకు వేస్తున్న బ్రూసెల్లో సిస్ నివారణ టీకాలు నిర్దిష్ట సమయంలోపు పూర్తి చేయాలని పశు వర్ధక శాఖ రాష్ట్ర డైరెక్టర్ అమరేంద్ర కుమార్ పశువర్ధక శాఖ అధికారులకు, వైద్యులకు ఆదేశించారు. శుక్రవారం హిందూపురం పట్టణంలోని ఓ హోటల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఉన్న పశువర్ధక శాఖ అధికారులు, వైద్యులతో ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు, పశు వైద్య సేవలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ముద్ద చర్మవ్యాధి ప్రబలుతున్న సందర్భంగా తీసుకుంటున్న జాగ్రత్తలు, గోజాతి పశువులకు వేస్తున్న గోట్ పాక్స్ టీకాల కార్యక్రమంపై ఆయన సంతప్తి వ్యక్తం చేశారు. వ్యాధులు తగ్గుముఖం పట్టే వరకు ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఉన్న పశుసంతానాలను మూసివేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం, శ్రీ సత్య సాయి జిల్లాల పశువర్ధక శాఖ అధికారులు డాక్టర్ రత్నకుమార్, డాక్టర్ సుబ్రహ్మణ్యం, ఉప సంచాలకులు డాక్టర్ రమేష్ రెడ్డి, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ పెంచలయ్య, డాక్టర్ శుభదాసు, డాక్టర్ గిరిజ, సహాయ సంచాలకులు, పశు వైద్యాధికారులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా సంక్షేమం


కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్సీ

హిందూపురం : రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామనిఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ పేర్కోన్నారు. శుక్రవారం హిందూపురం పురపాలక సంఘ పరిధిలోని6వ వార్డు ధర్మపురంలో గడప గడప కు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు ఎమ్మెల్సీకి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్ జబీవుల్లా, వార్డు ఇన్‌ఛార్జి మల్లికాభాను, కౌన్సిలర్లు అయూబ్, ముస్తాక్, రోషన్ అలీ, రహమత్‌బి, మల్లికార్జున, నాగేంద్రమ్మ, కో-ఆప్షన్ సభ్యులు రహమత్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమరాపురం : మండలంలోని వి. అగ్రహారం గ్రామాభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పేరొన్నారు. వి. అగ్రహారం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మారుమూల గ్రామమైన అగ్రహారం అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న, వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళినిరంగే గౌడ్, ఎంపీడీవో మునిస్వామి, జెడ్పీటీసీ నరసింహమూర్తి సోషల్ మీడియా కన్వీనర్ మంజునాథ, వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి, ఎంపీటీసీ లలితమ్మతో పాటు ఆయా శాఖల అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : పార్టీలు, ప్రాంతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక 24వ వార్డులో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పర్యటించారు. ఈసందర్భంగా ఇంటింటికి తిరిగుతూ ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. పలువురు వార్డు ప్రజలు వార్డు లోతట్టు ప్రాంతం కావడంతో డ్రైనేజీలు నీటిఊటతో నిండిపోతున్నాయని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పెనుజూరు నాగరాజు, మున్సిపల్ డీఈ వన్నూరుస్వామి, వార్డు కౌన్సిలర్ గోరకాటి పురుషోత్తంరెడ్డితో పాటు 40 వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు. వార్డు ఇన్‌ఛార్జులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ దారుణ హత్య

కదిరి టౌన్ : కదిరి పట్టణం కుటాగుల లో ఆటో స్టాండ్ వద్ద పట్టపగలే ఆటో డ్రైవర్ దారుణహత్యకు గురయ్యాడు. స్థానికులు, మృతుని బంధువులు తెలిపిన వివరాలు...కదిరి పట్టణం సైదాపురానికి చెందిన జల్లా శ్రీనివాసులు, ప్రభావతమ్మ కుమారుడు వంశీని గుర్తు తెలియని వ్యక్తులు కత్తితో కిరాతకంగా పొడవగా ఘటన స్థలంలోనే మృతిచెందాడు. హత్య విషయం తెలుసుకున్న కదిరి పట్టణ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుని భార్యతోపాటు ఏడాది వయస్సున్న చిన్నారి ఉన్నారు. ఇదిలా ఉండగా తమ సోదరుడు వంశీని కుటాగుల ఆటో స్టాండ్ వద్ద అర్జున్ అనే వ్యక్తితో పాటు మరికొందరు హత్య చేసి ఉంటారని మృతుని సోదరుడు భరత్ ఆరోపించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

పేకాట జూదరులు అరెస్టు

చిలమత్తూరు : మండల పరిధిలోని కల్లుకుంట గ్రామ సరిహద్దులో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. వారి వద్దనుంచి 10,540 రూపాయలు స్వాధీనం చేసుకొన్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

ఓబుల దేవర చెరువు : మండల పరిధిలోని గాజుగుంటుపల్లి వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో డబ్బురు వారి పల్లి పంచాయతీ మల్లెమల్లోలపల్లి గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థి అశోక్ కుమార్(18) మృతిచెందాడు. మరో విద్యార్థి ఈశ్వర్ గాయపడ్డారు. అశోక్ కుమార్, ఈశ్వర్ ఇరువురు మండల కేంద్రంలోని విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో బీకాం చదువుతున్నారు. ఒడిసి నుండి కదిరికి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా గాజుగుంటపల్లి వద్ద కదిరి నుండి ఎదురుగా వస్తున్న కారు వీరి వాహనాన్ని ఢీకొంది .ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అశోక్ కుమార్‌తో పాటు ఈశ్వర్ ను ప్రైవేటు వాహనంలో కదిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అశోక్ కుమార్ చికిత్స పొందుతూ మృతి చెందారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపీ తెలిపారు.

ద్విచక్ర వాహనాల వేలం

పరిగి : పరిగి పోలీస్ స్టేషన్ వద్ద 15 ద్విచక్ర వాహనాలకు వేలం పాటను నిర్వహించారు. ఈ వేలంపాట ద్వారా రూ. 5,84,690లు ఆదాయం సమకూరినట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు.ఈ వేలం పాటను ఎక్సైజ్ సిఐ భార్గవ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించినట్లు ఆయన తెలిపారు. మిగిలిన వాటిని 23 వ తేదీన మరోమారు వేలంపాట నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా

రొద్దం : అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన రొద్దం పోలీస్ స్టేషను శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రౌడీ షీటర్ల పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అదేవిధంగా కర్నాటక మద్యం తదితర వాటిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం లో పెనుకొండ డీఎస్పీ హుసేన్‌పీరా, సిఐలు కరుణాకర్, సుబ్బరాయుడు, నాగరాజరావు, ఎస్ఐ నాగస్వామి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల వాడకాన్ని అరికట్టండి

కదిరిటౌన్ : మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం అవుతున్నాయని వీటి వాడకాన్ని అరికట్టాలని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి భైరవప్రసాద్ డిమాండ్ చేశారు. గంజాయి, హెరాయిన్ వంటి మాదకద్రవ్యాలు మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడు,గుజరాత్ వంటి రాష్ట్రాల్లో పట్టుబతున్నాయనివీటికి కేంద్రబిందువు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కావడం బాధాకరమని అన్నారు. ఇలాంటి మత్తు పదార్థాలపై రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం తగదని అఆన్నరు. కదిరి పట్టణంలో చాలా వరకు యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారి వారి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. మత్తు పదార్థాలకు బానిసలుగా మారిన వారికి వారి తల్లి తండ్రుల సమక్షంలోనే కౌన్సిలింగ్ ఇచ్చి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జన సేన పార్టీ నాయకులు గంగరాజు, శ్రీనివాసులు, గంగులప్ప, అంకాలప్ప, కదిరి ఐటీ వింగ్ కోఆర్డినేటర్ పొరకల రాజేంద్ర ప్రసాద్, పులగంపల్లి రాజా, సాడగల గణేష్ రాజ్, అన్నం జయ వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో విత్తన పంపిణీకి చర్యలు

పుట్టపర్తి అర్బన్ : రబీ సీజనులో సకాలంలో విత్తనాలు పంపిణీకి చర్యలు తీసుకొంటామని జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లో జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఇందులో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి. వ్యవసాయ శాఖ జిల్లా అధికారి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. రమణారెడ్డి మాట్లాడుతూ రబీ సీజన్ లో అవసరమైన వేరుశనగ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. డిసెంబరు నాటికి పంపిణీకి సిద్ధం చేయాలని, పట్టు పరిశ్రమ సాగు పట్ల రైతులు మొగ్గు చూపుతున్నారని వారిని ప్రోత్సహించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా తోట బడి కిట్లను కలెక్టర్, చైర్మన్ విడుదల చేశారు. ఈ సమావేశంలో పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి సుబ్రహ్మణ్యం, ఉద్యానవన శాఖ జిల్లా అధికారి చంద్రశేఖర్, నాబార్డ్ ఎజిఎం ఉషా మధుసూదన్, సిరికల్చర్ జెడి పద్మమ్మ, మార్కెటింగ్ శాఖ అధికారి మూర్తి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి అశ్వర్థ నారాయణ నాయక్, కదిరి వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త సంపత్ కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలి

కదిరి టౌన్ : వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చే దాకా తమ పోరాటం కొనసాగుతుందని శ్రీ ఖాద్రీ వడ్డెర్ల సంఘం నాయకులు పేర్కొన్నారు వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలని శ్రీ ఖాద్రీ వడ్డెర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కదిరిలో మూడు రోజుల పాటు చేపట్టిన రిలే నిరాహారదీక్షలను శుక్రవారం విరమించారు. ఈ సందర్భంగా వడ్డెర ఎస్టీ సాధన జెఎసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నాయకులు ఎస్.బి రాజు, పులివెందుల మున్సిపల్ చైర్మన్ వల్లెపు వరప్రసాద్, మాజీ వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ దేవల్ల మురళి,వడ్డెర సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డె వెంకట్, వడ్డెర ఎస్టీ సాధన జె.ఏ.సి నాయకులు సంపంగి గోవర్ధన్ మాట్లాడుతూ వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చేదాకా పోరాటం కొనసాగిస్తామన్నారు. అనంతరం నాయకులు బత్తల వెంకట రమణ,వల్లెపు వరప్రసాద్,వడ్డె వెంకట్ దీక్షలో పాల్గొన్నవారికి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో అధికసంఖ్యలో వడ్డెర సంఘం నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి రథోత్సవం

పుట్టపర్తి అర్బన్ : పట్టణంలో వేణుగోపాల స్వామి రథోత్సవం అంగరంగవైభవంగా జరిగింది. సత్యసాయి వేడుకలు ప్రతి ఏటా రథోత్సవంతో ప్రారంభమవుతాయి. శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు వేణుగోపాల స్వామి దేవాలయం నుంచి ప్రశాంతి నిలయం గోపురం రోడ్డు ప్రధాన ద్వారం వరకు రథోత్సవం కొనసాగింది. ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ హాలు నుంచి వేణుగోపాల స్వామి విగ్రహాన్ని రథంలో వేద పండితులు మంత్రోచ్చారణలతో అధిష్టించారు. సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్ జె రత్నాకర్, ట్రస్టు సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఓబుళపతి, పుడా చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, అదనపు ఎస్పీ రామకృష్ణ ప్రసాద్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకుముందు సాయి కుల్వంత్ హాలు లో సామూహిక సాయి సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. రథం ముందు వివిధ దేవతామూర్తుల వేషధారణలతో సాయి విద్యార్థులు ప్రదర్శనలు చేశారు.కీలు గుర్రాలు, గురవయ్యలు, ప్రదర్శనలు, కేరళ నృత్యాలు, చెక్కభజన, కోలాటం, డప్పు వాయిద్యాలు తదితర ప్రదర్శనలు అలరించాయి. ఎలాంటి సంఘటనలు జరగకుండా డీఎస్పీ యశ్వంత్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కోటా సత్యం, మాజీ చైర్మన్లు పిసి గంగన్న, బెస్త చలపతి, డాక్టర్ గోపాల్ రెడ్డి, సామకోటి ఆదినారాయణ, మాధవరెడ్డి, గంగాద్రి తదితరులు పాల్గొన్నారు.


రథోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు